క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన విద్యార్థులు



అంబర్‌పేట: జేఈఈ అడ్వాన్స్‌ ఫలితాల్లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన చిద్విలాసరెడ్డి డీడీ కాలనీ శ్రీ చైతన్య శాఖ విద్యార్థితో పాటు మరో 100 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. దీంతో సోమవారం డీడీ కాలనీలో కళాశాల ప్రాంగణ పరిసరాల్లో ర్యాలీ నిర్వహించి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఏజీఎంలు సతీష్‌కుమార్‌, అంకిరెడ్డి, ప్రిన్సిపల్స్‌ ఉదయ్‌కిరణ్‌, రమణారావు, మణికంఠ, శ్రీనివాస్‌, సుజాత, మాధవి, లావణ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు సామాన్యుడి ఆయుధం



ముషీరాబాద్‌: ప్రజాస్వామ్యంలో ఓటే సామాన్యుడి ఆయుధమని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని ముషీరాబాద్‌ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ పిలుపునిచ్చారు. సోమవారం రాంనగర్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ ఉపాధ్యక్షులు రమేష్‌యాదవ్‌ ఆధ్వర్యంలో దాయరమార్కెట్‌ వద్ద నూతన ఓటరు నమోదు, చిరునామా మార్పు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్‌, ముఠా జైసింహ, రాంనగర్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ అధ్యక్షులు రావులపాటి మోజెస్‌ తదితరులు హాజరయ్యారు. ముదిగొండ మురళి, ఎర్రం శేఖర్‌, ప్రవీణ్‌ముదిరాజ్‌, శ్రావణ్‌, శ్రీనివాస్‌, మున్నానాయక్‌, జశ్వంత్‌, వాసుదేవ్‌, మోయిస్‌, శంకర్‌ తదితరులున్నారు.

ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధ వహించాలి

కవాడిగూడ: విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని బీఆర్‌ఎస్‌ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్‌ యువజన విభాగం నగర నాయకుడు రవీంద్ర కోక, మోరిస్‌ల ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లోని అమన్‌ వేదిక రెయిన్‌బో హోమ్‌లో పిల్లలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఠా జైసింహ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా రాణించేలా కృషి చేయాలని సూచించారు. డాక్టర్‌ సురేష్‌, భువన, వివేక్‌, సౌమ్య, అనుదీప్‌ ఉన్నారు.

కొండా సరోజిని సేవలు చిరస్మరణీయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ సంఘ సేవకురాలు కొండా సరోజిని సేవలు చిరస్మరణీయమని ముషీరాబాద్‌ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ అన్నారు. సోమవారం వీఎస్‌టీ ఫంక్షన్‌హాల్‌లో ఆమె సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాజిక సేవలు చేసే వారికి సమాజంలో ఎప్పటికీ గుర్తింపు లభిస్తుందని ఆమె గొప్ప మానవతావాదని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో తనవంతు కృషి చేశారన్నారు. వీఎస్‌టీ కార్మిక సంఘం అధ్యక్షులు వి.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర బీఆర్‌ఎస్‌ కార్మిక సంఘం అధ్యక్షుడు రాంబాబుయాదవ్‌, సతీష్‌, అశోక్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, నారాయణరెడ్డి, ప్రభాకర్‌ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులున్నారు.

'మున్నూరుకాపు కార్పొరేషన్‌' ఏర్పాటు చేయాలి

కాచిగూడ: రాష్ట్రంలో బీసీల్లో అత్యధిక జనాభా కలిగిన మున్నూరు కాపుల సంక్షేమం, అభివృద్ధి కోసం మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.5వేల కోట్ల నిధులు కేటాయించాలని మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ కొండ దేవయ్య సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. మున్నూరుకాపు సంఘం ప్రతినిధి బృందంతో కలిసి సోమవారం హైదరాబాద్‌ జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షుడు ఆర్‌.వీ.మహేందర్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లా కేంద్రాల్లో మున్నూరుకాపు విద్యార్థినీవిద్యార్థులకు హాస్టల్‌ భవనాల నిర్మాణం కోసం ఒక ఎకరం స్థలాన్ని కేటాయించి రూ.2 కోట్ల నిధులను కేటాయించాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. తోట శ్రవణ్‌, వాసాల వెంకట్‌, రాజేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

బాధితుల గోడుపట్టని ప్రభుత్వం

చిక్కడపల్లి: హుస్సేన్‌సాగర్‌ నాలా రిటైనింగ్‌ వాల్‌ నిర్మాణం సందర్భంగా ఇళ్లు కోల్పోతున్న బాధితుల గోడును ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్‌ పార్టీ సికింద్రాబాద్‌ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్‌ ఆరోపించారు. హుస్సేన్‌సాగర్‌ నాలా రిటైనింగ్‌వాల్‌ నిర్మాణంలో భాగంగా సబర్మతీనగర్‌లో జీహెచ్‌ఎంసీ ఇళ్ల కూల్చివేతలను నిర్వహించారు. స్థానికులు ఫిర్యాదుతో గాంధీనగర్‌ డివిజన్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు అభిషేక్‌కెన్నడీ, పలువురు కాంగ్రెస్‌ నాయకులతోపాటు సోమవారం అనిల్‌కుమార్‌యాదవ్‌ సబర్మతినగర్‌కు చేరుకుని బాధితులతో మాట్లాడారు. బాధితులకు ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూమ్‌ ఇళ్లను కేటాయించాలని డిమాండ్‌ చేశారు. కాగా ముషీరాబాద్‌ తహసీల్దార్‌ను కలిసి విన్నవిస్తామన్నారు.

సందడిగా హరితోత్సవం



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్‌



శివం అడ్వాన్స్‌ ట్రైనింగ్‌ ఇనిస్టిట్యూట్‌ ప్రాంగణంలో ఎడ్ల సుధాకర్‌రెడ్డి



బాగ్‌అంబర్‌పేటలో పద్మావెంకట్‌రెడ్డి



విద్యుత్‌ దహనవాటిక పార్కులో కార్పొరేటర్‌ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌

అంబర్‌పేట, ముషీరాబాద్‌ నియోజకవర్గ పరిధిలో హరితోత్సవం సందడిగా సాగింది. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పలువురు ప్రజా ప్రతినిధులు ప్రజలకు సూచిస్తూ.. వారు స్వయంగా మొక్కలు నాటారు. ప్రభుత్వ, ప్రైవేటు తదితర సంస్థల్లో హరితహారం నిర్వహించారు.

– అంబర్‌పేట, ముషీరాబాద్‌ జోన్‌ బృందం

- 2015–16 సంవత్సరంలో అటవీ విస్తీర్ణం 19,854 చదరపు కిలోమీటర్లు ఉండగా.. ప్రస్తుతం 2023 నాటికి 26,969 చదరపు కిలోమీటర్ల మేరకు అటవీ ప్రాంతం విస్తీర్ణత పెరిగిందన్నారు.
- పల్లెలు, పట్టణాల్లో ప్రకృతి వనాలు, అర్బన్‌ ఫారెస్టు పార్కులు వంటివి పెంచుతూ.. పచ్చదనాన్ని పెంచామన్నారు.



మొక్క నాటుతున్న మాజీ కార్పొరేటర్‌ వి.శ్రీనివాస్‌రెడ్డి



శివంరోడ్డు అడ్వాన్స్‌ ట్రైనింగ్‌ ఇనిస్టిట్యూట్‌ ప్రాంగణంలో ఎమ్మెల్యే కాలేరు



చిక్కడపల్లి పీఎస్‌లో మొక్కలు నాటుతున్న సెంట్రల్‌ జోన్‌ డీసీపీ వెంకటేశ్వర్లు, ఏసీపీ రమణారెడ్డి



కెనరాబ్యాంక్‌ పార్క్‌లో కార్పొరేటర్‌ పావనీవినయ్‌కుమార్‌



ఇందిరాపార్కులో కార్పొరేటర్‌ రచనశ్రీ

రేషన్‌షాపుల్లో 12 రకాల సరుకులు ఇవ్వాలని ధర్నా



ధర్నా చేస్తున్న పీవైఎల్‌, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేద ప్రజలకు రేషన్‌ షాపుల ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంతో పాటు సన్నబియ్యం, అర్హులైన వారందరికి రేషన్‌ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ.. పీవైఎల్‌, పీఓడబ్ల్యూల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సర్కిల్‌–6 సివిల్‌ సప్లై కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు డి.స్వరూప, పీవైఎల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్‌.ప్రదీప్‌, గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షులు వరలక్ష్మిలు మాట్లాడారు. నిత్యవసర ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా ఉన్నాయని హైదరాబాద్‌లో ప్రజలు వివిధ జిల్లాల నుంచి వలసలు వచ్చి చేతికష్టం మీద ఆధారపడి జీవిస్తున్నారన్నారు. గత పాలకులు 9 రకాల నిత్యవసర సరుకులు ఇవ్వడంతో ప్రజలకు సర్దుబాటు అయిందని ప్రస్తుతం ఇవ్వకపోగా.. ధరలను విపరీతంగా పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసే 5 కేజీల బియ్యంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా 5 కేజీల సన్నబియ్యం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కొత్త వారికి రేషన్‌ కార్డులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఏఎస్‌ఓ దీప్తికి వినతిపత్రం అందజేశారు. పీవైఎల్‌ రాష్ట్ర నాయకులు రవికుమార్‌, భూషణవేణి కృష్ణ, కిరణ్‌, బండారి శ్రీనివాస్‌, రాజు, ఆంజనేయులు, గణేష్‌, మీనా, నాగేశ్వర్‌రావు తదితరులున్నారు.

ప్రజా సమస్యలపై అలసత్వం వద్దు

అంబర్‌పేట: వర్షాకాలంలో నాలా సమస్యలు తలెత్తకుండా చొరవ తీసుకుంటానని అంబర్‌పేట డివిజన్‌ కార్పొరేటర్‌ విజయ్‌కుమార్‌గౌడ్‌ అన్నారు. సోమవారం డివిజన్‌లోని ఓవైసీనగర్‌, చెన్నారెడ్డినగర్‌ తదితర ప్రాంతాల్లో నాలా, కలుషిత తాగునీటి సమస్యపై స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్‌ పర్యటించి పరిశీలించారు. స్థానికుల నుంచి సమస్య వివరాలను కార్పొరేటర్‌ తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యలపై అధికారులు అలసత్వం వహించకూడదని హితవు పలికారు.



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ విజయ్‌కుమార్‌గౌడ్‌

బోరు వేయించాలని డీఎంసీకి వినతి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దోమలగూడలోని శ్మశానవాటికలో బోర్‌వెల్‌ వేయాలని కోరుతూ సోమవారం వాల్మీకి మెతార్‌ సమాజ్‌ శ్మశానవాటిక ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–15 డిప్యూటీ కమిషనర్‌ డాక్టర్‌ తిప్పర్తి యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన డీఎంసీ త్వరలో సమస్యను పరిష్కరించేందుకు హామీ ఇచ్చారన్నారు. వాల్మీకి మెతార్‌ సమాజ్‌ అధ్యక్షుడు సుభాష్‌, ప్రధాన కార్యదర్శి సురేందర్‌, నాయకులు ఎస్‌.రాజేందర్‌, ఉపాధ్యక్షులు కిషన్‌, ధర్మవీర్‌, పప్పు, శ్రీకాంత్‌ తదితరులున్నారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న వీహెచ్‌, కాంగ్రెస్‌ నేతలు

అంబర్‌పేట: కాంగ్రెస్‌ జాతీయ సీనియర్‌ నాయకులు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. సోమవారం కాంగ్రెస్‌ నాయకులు రావుల సుధాకర్‌ ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేట కురుమబస్తీలో రాహుల్‌గాంధీ పుట్టినరోజు సందర్భంగా ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ హనుమంతరావు పాల్గొన్నారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలభిషేకం చేసి కేక్‌కట్‌ చేశారు. మాజీ కార్పొరేటర్‌ జ్ఞానేశ్వర్‌గౌడ్‌, నాయకులు ఆర్‌.లక్ష్మణ్‌ యాదవ్‌, శ్రీకాంత్‌గౌడ్‌, సత్తిబాబుగౌడ్‌, సునీతా రెడ్డి, లావణ్య, శ్రీధర్‌, జమీర్‌ తదితరులున్నారు.

గోల్కొండ చౌరస్తాలో..

ముషీరాబాద్‌: కాంగ్రెస్‌ పార్టీ మాజీ నగర అధ్యక్షులు కృపారావు కుమారుడు, సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకులు కన్న డానియల్‌ ఆధ్వర్యంలో గోల్కొండ చౌరస్తాలో రాహుల్‌ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఏఐసీసీ ఫిషర్‌ మెన్‌ కమిటీ సభ్యులు బిజ్జి శత్రుఘ్‌, సీనియర్‌ నాయకులు యాదగిరి, రాజు, విజయకుమార్‌యాదవ్‌, అబ్దుల్‌ ఖాదీర్‌, కరణం సురేష్‌, రామకృష్ణ, రావుల శ్రీకాంత్‌, పులి సందీప్‌, ప్రవీణ్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్‌ పార్టీ నాయకులు పాల్గొని అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు.

ముషీరాబాద్‌: ఏఐసీసీ మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్‌ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా రాంనగర్‌గుండులోని శ్రీ గురు సంకల్పంకు చెందిన మానసిక దివ్యాంగ విద్యార్థుల మధ్య నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్‌ముదిరాజ్‌ విద్యార్థులకు పంపిణీ చేశారు. కాంగ్రెస్‌ నాయకులు రాజు, రాములు, వల్లభరెడ్డి, శ్రీనివాస్‌, చక్రం, రమేష్‌ తదితరులున్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్‌

పుస్తకాల పంపిణీ..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్‌ పార్టీ సికింద్రాబాద్‌ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్‌ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం సుందరయ్య పార్కు వద్ద ముషీరాబాద్‌ నియోజకవర్గ యువజన కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పుట్టినరోజు సందర్భంగా 300 మంది పేద విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముషీరాబాద్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ బి–బ్లాక్‌ అధ్యక్షుడు అంజియాదవ్‌, యువజన కాంగ్రెస్‌ అధ్యక్షుడు సంఘపాక వెంకట్‌, ఏ–బ్లాక్‌ అధ్యక్షుడు వీడి కృష్ణ, కార్పొరేటర్‌ కల్పనాయాదవ్‌, తోట విష్ణు, గుర్రం శంకర్‌, పాల్‌, రాజు, తిరుమలేచారి, అభిషేక్‌ తదితరులున్నారు.

ఈ నెల 22న శ్రీకా ఈవెంట్స్‌ వార్షికోత్సవం

చిక్కడపల్లి: ఈనెల 22న త్యాగరాయగానసభలో మధ్యాహ్నం నుంచి 10 గంటల పాటు నిరాటంకంగా సంగీత, వాయిద్య, నృత్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీరాగ వల్లరి కళాసంస్థ, శ్రీకా ఈవెంట్స్‌ నిర్వాహకులు తనికెళ్ల ఉదయశ్రీ, చంద్రరేఖలు తెలిపారు. సోమవారం చిక్కడపల్లిలో వారు మాట్లాడుతూ.. ముఖ్య అతిథిగా కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు డాక్టర్‌ ఎస్పీ.భారతి, పాల్గొంటారన్నారు. శాస్త్రీయ సంగీత గురువు డాక్టర్‌ ఎర్రమిల్లి రమాప్రభ, సంగీత దర్శకుడు ఎస్‌.ఎస్‌.ఆత్రేయ, గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి, బీజేపీ నాయకుడు వంశీకృష్ణ, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ తదితరులు హాజరవుతారని సమాచారం.

వర్గ బేధాలను రూపుమాపేందుకు సుందరయ్య కృషి

చిక్కడపల్లి: కుల,మత, వర్గ బేధాలను రూపుమాపేందుకు కృషి చేసిన ఉద్యమశీలి, త్యాగధనుడు పుచ్చలపల్లి సుందరయ్య అని మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి అన్నారు. త్యాగరాయగాన సభ ఆధ్వర్యంలో సోమవారం శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా పుచ్చలపల్లి సుందరయ్య సంస్మరణ సమావేశం సభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో పేద, ధనిక వర్గాల బేధాలను రూపుమాపేందుకు ఉద్యమించిన సుందరయ్య మార్క్సిజాన్ని నమ్మి నిబద్ధతతో జీవితాంతం కృషి చేశారన్నారు. ఎంపీగా సైకిల్‌పై వెళ్లిన సుందరయ్య నిరాడంబరత ఇతరుల సమస్యల పరిష్కారంలో సహనంతో వ్యవహరించడం కామ్రేడ్‌కు ప్రతీక అన్నారు. స్వార్థం పెరుగుతుందన్న ఆలోచనతో సంతానం వద్దనుకున్న త్యాగశీలి సుందరయ్య అని ఆయన గురించి నేటి తరానికి తెలియజేసే ప్రయత్నం చేస్తున్న గానసభ పాలకవర్గాన్ని ఈ సందర్భంగా అభినందించారు. ప్రముఖ కవి వడ్డేపల్లి కృష్ణ మాట్లాడుతూ.. సుందరయ్య వేసిన బాటలో సీపీఎం సమాజంలో ప్రగతిశీల చైతన్యవంత ఉద్యమాల కోసం పనిచేస్తున్నాయన్నారు. విశ్రాంత న్యాయమూర్తి మధుసూదన్‌, తిరుమణి చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌ దొంగ రిమాండ్‌

కాచిగూడ: సెల్‌ఫోన్‌ దొంగతనాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న దొంగను కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన బద్రోద్దిన్‌ కుమారుడు సోయల్‌ (27) ఉదయం, రాత్రి సమయాల్లో రైల్వేస్టేషన్ల వద్ద ప్రయాణికుల డబ్బు, సెల్‌ఫోన్లను దొంగిలిస్తుంటాడు. కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఓ ప్రయాణికుడి ఖరీదైన సెల్‌ఫోన్‌ను తీసుకొని పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రైల్వే పోలీసులు కోర్టు ద్వారా లొంగిపోవాలని పలుమార్లు సమన్లు పంపినా సమాధానం రాకపోవడంతో సోమవారం నిందితుడిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌ చేశారు.

రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలి



బహిరంగ లేఖను విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయలలోపు రైతులకు రుణమాఫీ చేయాలని కోరుతూ.. తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో సీఎంకు బహిరంగలేఖ రాశారు. తెలంగాణ రైతుసంఘం కార్యదర్శి సాగర్‌, ఉపాధ్యక్షుడు జులకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహ్మారెడ్డి, ప్రసాద్‌రావు, శోభన్‌నాయక్‌లు సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహిరంగ లేఖను విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 13 డిసెంబర్‌ 2018న రైతుల రుణం రూ.లక్ష వరకు మాఫీ చేస్తున్నామని ప్రకటించిందని ఈ రుణమాఫీని నాలుగు వార్షిక విడతలలో మాఫీ చేస్తామని స్వయంగా సీఎం కేసీఆర్‌ ప్రకటించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటి వరకు ఉన్న రైతుల రుణమాఫీ బాకీని ఒకే విడతగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి రైతులను రుణ విముక్తి చేయాలని కోరారు. ప్రస్తుతం బ్యాంకులు రైతులకు రుణాలు ఇవ్వడం లేదని వారి రుణాలను తిరగరాసి బుక్‌ అడ్జస్ట్‌మెంట్‌ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం గుర్తించిన మేరకు రైతుల రుణమాఫీకి నిధులు విడుదల చేయాలని కోరారు. వ్యవసాయం కోసం నగలు తాకట్టు పెట్టిన వారికి కూడా లక్ష లోపు రుణం మాఫీ చేస్తామని ప్రభుత్వ జీవోలు చెప్పారన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల రుణవిముక్తి కోసం తగిన నిధులు విడుదల చేయాలని లేఖలో కోరినట్టు సమాచారం.

ప్రజా సంక్షేమం.. అభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్‌ కన్నె ఉమారమేష్‌యాదవ్‌

కాచిగూడ: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా.. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని అంబర్‌పేట్‌ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ అన్నారు. సోమవారం కాచిగూడ డివిజన్‌ కాశీరాంజీరా బస్తీలో రూ.50 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్‌ కన్నె ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ నేతృత్వంలో అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. సీఎం కేసీఆర్‌ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ.. దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలుపుతున్నారన్నారు. కాంట్రాక్టర్లు చేస్తున్న అభివృద్ధి పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఫండ్‌ నుంచి రూ.12 కోట్లు మంజూరయ్యాయని, వీటితో 54 రోడ్ల నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. జలమండలి నుంచి రూ.18 కోట్లు మంజూరయ్యాయని వీటి ద్వారా 99 తాగునీటి, సివరేజ్‌ పనులను చేపడుతున్నామన్నారు. బీఆర్‌ఎస్‌ నేతలు ఎర్ర భీష్మదేవ్‌, మాజీ కార్పొరేటర్‌ దిడ్డి రాంబాబు, డాక్టర్‌ బద్దుల శిరీష ఓంప్రకాష్‌ యాదవ్‌, దాత్రిక్‌ నాగేందర్‌ బాబ్జీ, సునిల్‌ బిడ్లాన్‌, మన్నె శ్రీనివాస్‌యాదవ్‌, శ్రీశైలం, కృష్ణాగౌడ్‌, బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్‌, సంతోష్‌, సుభాష్‌ పటేల్‌, బీంరాజ్‌, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్వరీష్‌బాగ్‌లో..

రూ.22 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్‌ కన్నె ఉమా రమేష్‌ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ ప్రారంభించారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆయన అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

రూ.38 లక్షలతో సీసీ రోడ్డు పనులు

అంబర్‌పేట: నియోజకవర్గంలో రోడ్ల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ తెలిపారు. సోమవారం గోల్నాక డివిజన్‌ ఖాద్రీబాగ్‌లో కార్పొరేటర్‌ దూసరి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి రూ.38 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రతి ప్రాంతంలో రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసినట్లు ఆయన వెల్లడించారు. వర్షాకాలంలో రోడ్లు, గుంతల సమస్య తలెత్తకుండా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక బీఆర్‌ఎస్‌ నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని వినతి



లేబర్‌ కమిషనర్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఆర్‌టీ కాలనీ సభ్యులు

ముషీరాబాద్‌: రాంనగర్‌ డివిజన్‌లోని ఎస్‌ఆర్‌టీ కాలనీలోని ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని భూకబ్జాదారుల నుంచి కాపాడాలని కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు విజయ్‌రావు డిమాండ్‌ చేశారు. సోమవారం లేబర్‌ కమిషనర్‌ శ్యామ్‌సుందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌రావు మాట్లాడుతూ.. కాలనీలోని 1–7–1046//1 నుంచి 1–7–1046/15 వరకు వెనకభాగంలో గల ఖాళీస్థలాన్ని కొంతమంది కబ్జాచేసి విక్రయించేందుకు యత్నిస్తున్నారన్నారు. కాలనీవాసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే దాడులు చేస్తున్నారని ఆరోపించారు. వారి నుంచి తమకు రక్షణ కల్పించి కాలనీ స్థలాన్ని కాపాడాలని కోరారు. కాలనీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ శశికళ, ముఖ్య సలహాదారులు బల్వీర్‌కుమార్‌, కాలనీ కార్యదర్శి మధుబాబు, సంయుక్త కార్యదర్శులు లక్ష్మి, నఫీసా, రేణుక, రాణి, కళావతి, శామ్యుల్‌, ప్రభుజలగం తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అంబర్‌పేట: డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో నిర్మించేందుకు తన వంతు చొరవ తీసుకుంటున్నట్లు బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్‌ బీ.పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం డివిజన్‌లో రూ.58 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఆమె అధికారలతో కలిసి పరిశీలించారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆమె అధికారులకు సూచించారు. అలాగే వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను జాగ్రత్తగా పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగితే స్థానికంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆమె అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.

పనులను సకాలంలో పూర్తి చేయాలి..

ముషీరాబాద్‌: రాంనగర్‌ డివిజన్‌ హరినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని రాంనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ కె.రవిచారి కోరారు. సోమవారం డివిజన్‌లోని వైట్‌ హౌజ్‌ హోటల్‌ నుంచి అబ్బసాయి అపార్ట్‌మెంట్‌ వరకు రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ డీఈ గీతతో కలిసి పరిశీలించారు. త్వరలో వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పనులు పూర్తిచేయాలని సూచించారు. బీజేపీ నాయకులు గడ్డం నవీన్‌, సతీష్‌, వాసు, రాకేష్‌ తదితరులున్నారు.



బీటీరోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ పద్మావెంకట్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ కె.రవిచారి, డీఈ గీత

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



జలమండలి ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌.గౌతంరావు

కాచిగూడ: గ్రేటర్‌ హైదరాబాద్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నల్లాల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు ఆయా ప్రాంతాల్లో కలుషితమై వస్తుండటంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని బీజేపీ హైదరాబాద్‌ సెంట్రల్‌ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ ఎన్‌.గౌతంరావు అన్నారు. సోమవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలో పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్‌ చేశారు. ఈ మేరకు జలమండలి ఎండీ దానకిషోర్‌ను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతోనే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణాగౌడ్‌ పవన్‌, గంగరాజు తదితరులున్నారు.

రోడ్డు పనుల జాప్యంపై ఆగ్రహం..

అంబర్‌పేట: 'రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిపై ఆర్భాటపు ప్రచారాలకు, ఆచరణకు ఎక్కడ పొంతన లేదని' బీజేపీ సెంట్రల్‌ జిల్లా అధ్యక్షులు డాక్టర్‌ ఎస్‌.గౌతంరావు ఆరోపించారు. సోమవారం గోల్నాక డివిజన్‌ ఖాద్రిబాగ్‌, జైస్వాల్‌గార్డెన్‌లలో గత రెండేళ్ల క్రితం తవ్వి వదిలివేసిన రోడ్డు ఇప్పటి వరకు పూర్తి కాకపోవడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచన మేరకు గౌతంరావు పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పరిశీలించారు. పైపులైన్‌ కోసం తవ్విన రోడ్డు వేయడం జరుగుతున్న జాప్యంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. దీనిపై కేంద్రమంత్రి జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు లేఖ రాశామన్నారు. ఇప్పటికైనా తవ్విన రోడ్డును తక్షణమే నిర్మించాలని ఆయన అధికారులను కోరారు. బీజేపీ నాయకులు మూల రవీందర్‌గౌడ్‌, చింతల శ్రీనివాస్‌ముదిరాజ్‌, శ్రీధర్‌గౌడ్‌, వేణుగోపాల్‌, అనిల్‌చారి, సత్యనారాయణ తదితరులున్నారు.